వర్షంతో నిలిచిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

13వ తేదీకి వాయిదా: డిఐజి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్‌ఐ అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు సోమవారం వర్షం కారణంగా వాయిదా వేశారు. నగరంలోని పోలీస్ మైదానంలో 15 రోజులుగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ఆకస్మికంగా వర్షం రావడంతో పరీక్షలు వాయిదా వేశారు. వీటిని మళ్లీ ఈ నెల 13న నిర్వహిస్తామని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాకేంద్రం ఏలూరులో మూతపడిన వ్యాపార దుకాణాలు

భీమడోలులో ఆందోళన చేస్తున్న నాయకులు

బంద్ పాక్షికం..!

చంద్రబాబు రిమాండ్ నేపథ్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతం

ప్రయివేటు స్కూళ్లు, పలు దుకాణాలు స్వచ్ఛందంగా మూత

కొనసాగిన టిడిపి, జనసేన ర్యాలీలు, ఆందోళనలు

యథావిధిగా తిరిగిన ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో టిడిపి పిలుపు మేరకు చేపట్టిన బంద్ జిల్లాలో పాక్షికంగా సాగింది. పోలీసులు ముందస్తుగా నాయకులను గృహనిర్బంధం చేయడం, అదుపులోకి తీసుకోవడంతో బంద్ ప్రభావం తగ్గింది. బంద్ నేపథ్యంలో ప్రయివేటు విద్యాసంస్థలు పూర్తిగా మూతపడ్డాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెంతోపాటు పలు ప్రాంతాల్లో వ్యాపారులే స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. పలుచోట్ల టిడిపి నాయకులు దుకాణాలను మూయించిన ఘటనలూ ఉన్నాయి. ఏలూరులో డిఇఒ, రిజిస్ట్రార్, వ్యవసాయశాఖ కార్యాలయాలను సైతం టిడిపి నాయకులు మూయించారు. పోలీసులు రంగప్రవేశం చేసి టిడిపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఆర్‌టిసి బస్సులు మాత్రం యథావిధిగా నడిచాయి. ఒకపక్క జోరు వర్షం, మరోపక్క బంద్ నేపథ్యంలో జనం ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాత్రే బంద్‌కు పిలుపునివ్వడంతో ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. జనసేన సైతం బంద్‌కు మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీ నాయకులు రోడ్డెక్కి ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించారు. జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడుని పోలీసులు ముందస్తుగానే గృహనిర్బంధం చేశారు. కొన్నిచోట్ల దుకాణాలు మధ్యాహ్నం నుంచి తెరుచుకున్నాయి. తణుకు పట్టణంలో ఆర్‌టిసి బస్సులను సైతం టిడిపి నాయకులు నిలుపుదల చేశారు. పట్టణంలో టిడిపి, జనసేన నాయకుల ర్యాలీలు కొనసాగాయి. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, నరసాపురం వంటి పట్టణాల్లోనూ బంద్ పాక్షికంగా సాగింది. మండల కేంద్రాల్లోనూ నాయకుల ర్యాలీలు, ఆందోళనలు సాగాయి. ఎక్కడికక్కడే పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ముందస్తుగానే ప్రకటించారు. జిల్లా ఎస్‌పి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. చంద్రబాబుకు రిమాండ్ విధింపు జిల్లా ప్రజానీకంలో తీవ్ర చర్చనీయాంశమైంది. చంద్రబాబుకు బెయిల్ వస్తుందా, లేక జైల్లోనే ఉంటారా అంటూ పెద్దఎత్తున చర్చలు సాగాయి. పలుచోట్ల ఇదే అంశంపై బెట్టింగ్‌లు సాగడం గమనార్హం.

చింతలపూడిలో..

కైకలూరు పోలీస్ స్టేషన్‌లో నాయకులు..

ఏలూరులో టిడిపి నేతల ఆందోళన

కైకలూరులో టిడిపి, జనసేన నాయకుల అరెస్టు

కైకలూరు : మండల కేంద్రమైన కైకలూరులో బంద్ ఉద్రిక్తంగా మారింది. వ్యాపార సంస్థలను మూయిస్తున్న టిడిపి, జనసేన నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పూల రాజీ, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు కెకె.బాబు, పోలవరపు లక్ష్మీరాణి, డోకల శ్రీను, జనసేన నాయకులు బివి.రావు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అలాగే కైకలూరులోని టిడిపి ముఖ్యనేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పూల రాజీని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

చింతలపూడి:పట్టణంలో శాంతియుతంగా, ప్రశాంతంగా బంద్‌సాగింది. ప్రయివేటు విద్యాసంస్థలు, వ్యాపార దుకాణాలు, పెట్రోల్ బంకులు స్వచ్ఛందంగా మూసివేశారు. ఎంఆర్‌పిఎస్ చింతలపూడి నియోజకవర్గ నాయకులు బందుకు సంఘీభావం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ అవినాష్, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాగేంద్ర, మల్లాయిగూడెం సర్పంచి చికటి కవిత, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు చౌటపల్లి విజయ్ మాదిగ, నాయకులు నక్షత్రం మాదిగ, గొల్లపల్లి సౌజన్య మాదిగ, టిడిపి ఐటిడిపి నియోజకవర్గ నత్త రవికుమార్, నాగభూషణం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : పోలీస్ విధులకు అటంకం కలుగ చేసిన కేసులో నియోజకవర్గ టిడిపి యువనేత కొడాలి వినోద్‌ను సోమవారం కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం చంద్రబాబు నాయుడు అరెస్టైన సందర్భంగా కె.వినోద్ ముదినేపల్లిలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమం నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలతో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి వైకుడలిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు సిద్ధపడ్డారు. అయితే ఎస్‌ఐ వెంకటకుమార్ విగ్రహానికి పూలదండ వేయనీయకుండా వినోద్‌ను అడ్డుకున్నారు. దీంతో పోలీస్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ఆందోళన చేయడంతో వినోద్‌పై కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసి కైకలూరు తీసుకు వెళ్లిన వినోద్‌ను అనంతరం రూరల్ సిఐ కృష్ణకుమార్ వ్యక్తిగత పూచీకత్తుపై వినోద్‌ను విడుదల చేశారు.

నిరసన ప్రజాస్వామికు హక్కు

బంద్ సందర్భంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు:నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కు అని, టిడిపి బంద్ నేపథ్యంలో ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలు దారుణమని సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి తలపెట్టిన బంద్ సందర్భంగా జిల్లాలో టిడిపి, జనసేన నేతల అరెస్టులు సరికాదని పేర్కొన్నారు. టిడిపి, జనసేన ముఖ్యనేతలను గృహనిర్బంధంలో ఉంచడాన్ని ఖండించారు. శాంతియుత నిరసనలపై నిర్బంధం, 144 సెక్షన్, 30 యాక్ట్ అమలు అమానుషమని తెలిపారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సకాలంలో స్పందన అర్జీలకు పరిష్కారం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

స్పందన అర్జీదారుల సమస్యల పట్ల సకాలంలో స్పందించి నిర్ణీత గడువులోగా సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణరెడ్డి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఆర్‌డిఒ ఎస్‌కె.ఖాజావలి, జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారి రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణమూర్తి, అర్జీదారుల నుంచి 94 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.

జెసి మాట్లాడుతూ రీసర్వే మూడో విడత, స్టోన్ ప్లాంటేషన్, ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అసైన్డ్ ల్యాండ్ ఇనామ్ భూములకు సంబంధించిన అంశాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

అందిన అర్జీలలో కొన్ని..

పెదవేగి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన ఎం.నారాయణరావు తమ జాయింట్ భూమికి ఒకవాటాకు పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. బుట్టాయగూడెం మండలం జైనవారిగూడేనికి చెందిన కె.కృష్ణకుమారి వినతిని అందిస్తూ తమతల్లి ఇచ్చిన పసుపుకుంకుమ భూమిని ఇతరులు ఆక్రమించుకుని సాగుచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని తన భూమి తనకు ఇప్పించాలని కోరారు. ఉంగుటూరు మండలం తాళ్లపురం గ్రామానికి చెందిన కె.శ్రీను తమ భూమిని సర్వే చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. మండవల్లి మండలం లోకమూడి గ్రామానికి చెందిన కుసుమకుమారి తమ కుమారుడి డాక్టర్ చదువుకు ఇంటిని తాకట్టుపెట్టుటకు రిజిస్ట్రేషన్ చేయడానికి సంబంధిత అధికారులు నిరాకరించారని, తగిన పరిష్కారం చూపాలని అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు పట్టణ సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ పార్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల నుండి ఏలూరు నగరంలో తమ కార్యకర్తలు తిరుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రజలు రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు సరిగాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీల్లో ఉన్న తమని ఏలూరు నగరంలో కలిపి అభివృద్ధి చేయడం అటుంచి ఇంటి పన్నులు, నీటి పన్నులు పెంచారని, విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, చెత్త సేకరణ పన్ను కూడా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నగరంలో కుక్కలు, పందుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపల్ అధికారులు సరిగా స్పందించడం లేదన్నారు. తాము కట్టిన డబ్బుకు సంబంధించిన టిడ్కో గృహాలు అప్పగించాలని, జగనన్న కాలనీలో స్థలాలిచ్చిన అక్కడ ఇళ్లు నిర్మించుకునే స్తోమత తమ వద్ద లేదని, పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేసినట్లు చెప్పారు. జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రిలోనే అన్నిరకాల పరీక్షలు ఉచితంగా చేయాలని, విజయవాడ, గుంటూరుకు పంపకుండా మెరుగైన వైద్యం ఇక్కడే అందించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకొని అనేక సంవత్సరాలుగా నివాసముంటున్న కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ విధంగా తమ పార్టీ ప్రచార కార్యక్రమంలో ప్రజలను కలుస్తున్న సందర్భంగా అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించి, వారిపై భారాలు మోపకుండా సుపరిపాలన అందించాల్సిన బాధ్యత ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక దఫాలుగా ప్రజా సమస్యలపై నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు నిర్వహించామని తద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాయంత్రాంగం వెంటనే ప్రజా సమస్యలపై స్పందించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రవి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి పోరాటాలకు సిద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని ఆయన హెచ్చరించారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. మండవల్లి మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అలాగే పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు, భీమడోలు, ఉంగుటూరు, నూజివీడు, కైకలూరు, ముదినేపల్లి తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

ముదినేపల్లిలో వర్షపు నీటిలో వాహనదారులు అవస్థలు

మండవల్లి:మండలంలో సోమవారం విస్తారంగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆదివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై చిన్నగా ప్రారంభమైన వర్షం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండవల్లి జాతీయ రహదారి పామర్రు-దిగమర్రు రోడ్డుపై మండవల్లి వద్ద మోకాళ్లలోతు నీళ్లు నిలిచాయి. జాతీయ రహదారి చెరువును తలపించింది. గోతులు కనపడక

మండవల్లిలో జలమయమైన రోడ్డు

ప్రయాణికులు, వాహనదారులు వర్షపు నీటిలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండవల్లి ఎస్‌సి, బిసి కాలనీల్లోకి భారీగా వర్షపునీరు చేరింది. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు ఏకమై రహదారుల పైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 9 గంటలకు మొదలైన వర్షం సోమవారం ఉదయం 9 గంటల వరకూ కురిసింది. 12 గంటల పాటు కురిసిన వర్షంతో ముదినేపల్లి జలమైంది. రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. గత 8 నెలలుగా ఇంత భారీగా వర్షం కురిసింది లేదు. భారీ వర్షంతో పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ముదినేపల్లిలోని గురజ, పోలీస్‌స్టేషన్ రోడ్డు మోకాలు లోతు నీటితో నిండిపోవడంతో ప్రజలు నానా తిప్పలు పడారు. కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించింది.

ఆన్‌లైన్ మోసం.. రూ.66 వేలు నష్టపోయిన యువకుడు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణానికి చెందిన యువకుడు పార్ట్ టైం జాబ్ పేరుతో ఆన్‌లైన్ మోసానికి బలైయ్యాడు. సోమవారం యువకుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఎఎస్‌ఐ వై.మంగయ్య కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఎం.రమేష్ స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదాయం పెంచుకునే మార్గంలో అతను ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ కోసం ప్రయత్నించగా, 27625691767 అనే నెంబరు నుంచి మార్చి 21వ తేదీన రమేష్‌కు వాట్సాప్ ఫోన్ వచ్చిందన్నారు. అప్పటి నుంచే పార్ట్‌టైం ఆన్‌లైన్ వర్క్ ప్రారంభించాడని, చిన్న చిన్న మొత్తాలుగా చేసిన పనికి రమేష్ సొమ్ములు అందుకున్నాడన్నారు. సదరు ఆన్‌లైన్ వర్క్ ఇచ్చే వ్యక్తి పెద్ద మొత్తంలో ఆదాయం రావాలంటే ఇన్వెస్ట్ చేయొచ్చని రమేష్‌తో నమ్మబలికి దఫదఫాలుగా సొమ్మును డిపాజిట్ చేయించుకున్నాడన్నారు. ఇలా రమేష్ రూ.66వేల వరకూ ఆన్‌లైన్ వ్యక్తి అకౌంట్‌లో జమ చేశాడన్నారు. అనంతరం రమేష్ వాట్సాప్ అకౌంట్‌ను బ్లాక్ చేయడంతో అనుమానం వచ్చిన రమేష్ వెంటనే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడన్నారు. సైబర్ క్రైమ్ అధికారులు రమేష్ ఇచ్చిన సమాచారం మేరకు ఆన్‌లైన్ వ్యక్తి యొక్క వాట్సాప్, బ్యాంకు అకౌంట్‌ను హోల్డ్ చేసినట్లు సమాచారం ఇచ్చారన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్‌ఐ మంగయ్య తెలిపారు.

మరమ్మతులు నిమిత్తం గన్నవరం రైల్వేగేటు మూత

ప్రజాశక్తి - మండవల్లి

రైల్వే ట్రాక్ మరమ్మతులు చేయడానికి గన్నవరం రైల్వే గేటు మూసి వేస్తున్నామని సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి, గన్నవరం మధ్యలో ఉన్న రైల్వే గేటు మరమ్మతులకు నోచుకుందన్నారు. అందుచేత మరమ్మతుల నిమిత్తం 71వ గేటును ఈనెల 14 గురువారం నుంచి 18 సోమవారం వరకూ మూసివేస్తున్నామని ఆయన తెలిపారు. మరమ్మత్తుల అనంతరం రాకపోకలు సాగించేలా తిరిగి గేటును తెరుస్తామన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు, రైతులు గమనించి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా రాకపోకలు సాగించి, రైల్వే అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

ఐఎంసి పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రభుత్వ జిల్లాస్థాయి శిక్షణాకేంద్రంలో ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఐఎంసి కాంట్రాక్టు ఫ్యాకల్టీగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎల్.సరోజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను సెప్టెంబరు 25వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు స్వయంగా ఆఫీసులో గాని లేదా addltcitielr@gmail.com కు తమ బయోడేటాను అందజేయాలన్నారు. ఈ పోస్టుకు డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్/ఇంజనీరింగ్ ఇన్ ఎలక్ట్రికల్‌తో సంబంధించిన రంగంలో కనీసం రెండు సంవత్సరాల అనుభవం అర్హతగా పేర్కొన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ.10వేల నుంచి రూ.14వేల వరకూ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఆఫీసు 8332836944 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు..

విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై ప్రత్యేక శిక్షణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత చైతన్యవంతం చేసేందులో భాగంగా ప్రతి పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం వినియోగదారుల క్లబ్‌లో వినియోగదారులను చైతన్యం పరిచే 9 రకాల పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు వారి హక్కులు, పరిష్కార విధానాలపై అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన వినియోగదారులుగా వ్యవహరిస్తారని వినియోగదారుల క్లబ్‌ల ఏర్పాటు యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కె.ఖాజావలి పాల్గొన్నారు.

శ్రీవారికి రూ.2.52 కోట్ల హుండీల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు సోమవారం ఉదయం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. హుండీల లెక్కింపులో స్వామి వారికి గడచిన 26 రోజులకు గాను రూ.2 కోట్ల 52 లక్షల 31 వేల 596 ఆదాయం వచ్చింది. అలానే భక్తుల కానుకల రూపేన 337 గ్రాముల బంగారం, 7 కేజీల 632 గ్రాముల వెండి, రూ.500 (20 నోట్లు), రూ.1000 (1 నోట్లు) పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాధరావు తెలిపారు.

హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది

రామకృష్ణ మృతి బాధాకరం

కైకలూరు : రహదారి ప్రమాదంలో రామకృష్ణ మృతి చెందడం బాధాకరమని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ తెలిపారు. సోమవారం మండలంలోని గోపవరంలో పంతగాని రంగారావు కుమారుడు రామకృష్ణ(45) ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి వారి పార్థీవ దేహానికి పూలుమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిటిసిలు, సర్పంచి, వైసిపి నాయకులు

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం పంచాయతీలో సోమవారం రూ.40 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎంపిటిసిలు సున్నం సురేష్, కంచర్ల సుధారాణి తెలిపారు. దర్భగూడెంలో 'గడపగడపకు మన ప్రభుత్వ' కార్యక్రమ నిధుల నుంచి రూ.40 లక్షల బడ్జెట్‌ను కేటాయించి గ్రామంలోని పలు రోడ్లను కాంక్రీట్ రోడ్‌లుగా మార్చనున్నట్లు తెలిపారు. అదే విధంగా పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉషారాణి, ఉప సర్పంచి రాఘవరెడ్డి, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలి

ఏలూరు అర్బన్ : పెదవేగి మండలంలోని అమ్మపాలెం, కొప్పాక గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ అమ్మపాలెం, కొప్పాక గ్రామాల నుంచి బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు, అత్యంత పేద ప్రజానీకం వైద్య నిమిత్తం చిరు వ్యాపారులుగా నిత్యం ఏలూరు వస్తూ వెళ్తూ ఉంటారన్నారు. ఈ గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అత్యవసర వైద్య చికిత్సకి వచ్చి వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రోడ్లు కొత్తగా వేసినప్పటికీ ఈ గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించుటలో జిల్లా ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారు. కావున ఈ గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించుటకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సేన ఏలూరు మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి : వ్యకాస

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు, సమావేశాలు అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో ఏలూరులో నిర్వహిస్తున్నామని, ఈ సమావేశాలు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సోమవారం రాష్ట్ర సదస్సు, సమావేశాల కరపత్రాన్ని స్థానిక అన్నే భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదలందరికీ భూమి పంచాలని, కోనే రంగారావు కమిటీ సిఫార్సు అమలు చేయాలని, భూమిలేని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల ప్రభుత్వ భూమి పంచాలని కోరుతూ రాష్ట్ర సదస్సు, సమావేశాలు మూడురోజుల పాటు ఏలూరు నగరంలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో గత 25 ఏళ్ల నుంచి పేదలకు భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఉందన్నారు. ఈ కాలంలో దెందులూరు మండలం దోసపాడు, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, ఉంగుటూరు మండలాల్లో పేదల భూ సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నామన్నారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఉభయగోదావరి జిల్లాల టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, మరో 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు, ఎస్.మహంకాళి రావు, సిహెచ్ మాధవ, కె.సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యకాస నాయకులు

జంగారెడ్డిగూడెం ఎస్ఐగా మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఎస్ఐగా ఆర్.మల్లికార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 బ్యాచ్ నుంచి ఎస్ఐగా నరసాపురం, మొగల్తూరు, కాళ్ల, భీమవరంలలో పనిచేసినట్లు తెలిపారు. ఇటీవల ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు బదిలీపై జంగారెడ్డిగూడెం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. పట్టణంలో శాంతి భద్రతకు విఘాతం కలగకుండా కృషి చేస్తానన్నారు. నిష్పక్షపాతంగా ప్రజలకు పోలీస్ సేవలను అందిస్తానని తెలిపారు.

ముందస్తుగానే.. గణేష్ విగ్రహాలు

పిఒపి విగ్రహాలకే ఎక్కువ డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వినాయక చవితి పండుగ నేపథ్యంలో పలుచోట్ల గణేష్ విగ్రహాలు అమ్మకానికి సిద్ధమయ్యాయి. పట్టణంలోని జెపి సెంటర్ మైదాన ప్రాంతంలో గణేష్ విగ్రహాలను అధిక సంఖ్యలో సిద్ధం చేశారు. గతంలో గణేష్ విగ్రహాలను తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకునేవారు. కానీ దీనికి భిన్నంగా జంగారెడ్డిగూడెంలో అధిక సంఖ్యలో విగ్రహాలు తయారవడంతో వ్యాపారస్తులు పండుగలకు అవసరమైన పిఒపి విగ్రహాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు. పర్యావరణానికి మేలు చేసే మట్టి విగ్రహాల కంటే రసాయనాలతో తయారయ్యే పిఒపి విగ్రహాలకే డిమాండ్ ఉంటుందని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. భారీ సైజులో సిద్ధం చేసిన గణేష్ విగ్రహాలు రూ.2 వేల నుంచి రూ.50 వేల వరకూ తమ వద్ద లభిస్తాయని స్థానిక వ్యాపారులు తెలియజేశారు. ఏదేమైనా వినాయక చవితి విగ్రహాలు ఈ ఏడాది ముందస్తుగానే సిద్ధం చేశారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణేష్ విగ్రహాలు

తాగునీరు అందించాలి : సిపిఎం

గోదావరి జలాల సరఫరాకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలోని 19వ డివిజన్, సుందరయ్య కాలనీలో గత నాలుగు రోజులుగా తాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని సిపిఎం నగర కమిటీ తెలిపింది. తక్షణమే సుందరయ్య కాలనీకి మంచినీటి సరఫరా పునరుద్ధరించి, ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని కోరింది. ప్రతి రెండు, మూడు మాసాలకు ఒకసారి సుందరయ్య కాలనీకి మంచినీటి సమస్య ఏర్పడుతుందని, దీనిని శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. కార్పొరేషన్ ఎన్నికలకు ముందు ఆరు మాసాల్లో విలీన పంచాయతీలకు గోదావరి జలాలు సరఫరా చేస్తామని చెప్పిన పాలకులు, మూడు సంవత్సరాలు దాటినా గోదావరి జలాలు అందించడం లేదని విమర్శించారు. ప్రజానీకం ప్రత్యేకించి పాత వెంకటాపురం పరిధిలో ప్రజానీకం సుద్ధ నీరుతో అనేక అవస్థలు పడుతున్నారని కమిటీ తెలిపింది. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం తక్షణమే 19వ డివిజన్, సుందరయ్య కాలనీలో మంచినీటి సమస్య పరిష్కరించాలని, గోదావరి జలాల సరఫరాకు చర్యలు చేపట్టాలని సిపిఎం కోరింది.

వైసిపి కార్యాలయంలో కేక్ కటింగ్

ఘనంగా మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చింతలపూడి

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను చింతలపూడి మండలంలో వైసిపి నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వైసిపి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆత్మూరి సుబ్బారావు, చింతలపూడి గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, పట్టణ సచివాలయ కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : వైసిపి రాజంపేట, ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల రీజనల్ ఇంఛార్జి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. సోమవారం మిథున్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేకును ఎంఎల్ఎ ఏలిజా కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు,పళ్లుపంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, ULAMPARTHI LAVANYA, W/o. Ulamparthi Jashva Daniel, Age 38 Years, Female, Hindu, D.No. 5-5, Chakirevugunta, Jinnuru - 534 265, Poduru Mandal, West Godavari District, A.P., India. Have Changed My Surname From **ULLAMPARTHI LAVANYA (Old Name) to ULAMPARTHI LAVANYA (New Name).** Hence After All My Documents (Passport Etc.,) and Correspondence will Continue with My New Name **ULAMPARTHI LAVANYA.**

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం. 79/2022

ఓ.యస్.నెం. 42/2017

బిట్వీన్:

కోటబోయిన కాసులు ...డి. హెచ్. ఆర్

మరియు

ఈపి మురళి కృష్ణ ...జె. డి. ఆర్

పై నెంబరు గ్రంథములో డి.హెచ్.ఆర్ గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయు చున్నారు అనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.26-09-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆ రోజు ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, మీ వకీలుగారి ద్వారా కానీ హాజరు అయ్యి మీ యొక్క అక్షేపణలు తెలుపుకొనవలయును.** లేనియెడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గొల్లపూడి వెంకట ద్వారకానాథ్
న్యాయవాది,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
11-09-23. సెల్: 93464 84736

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి :: ఏలూరు

ఇ.పి.నెం. 268/2017

ఒ.యస్.నెం. 286/2015

బిట్వీన్:

చింత రాజారావు ...డిక్రీ హోల్డర్

మరియు

శ్రీమతి దామెర్ల రాధిక ...జడ్జిమెంటు డెటారు

డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల ఇ.పి. వారంటు గ్రంథములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.03-10-2023వ తేదీన ఉదయం గం||10:30 ని||లకు వేలం వేయుదురు.** ఆసక్తి ఉన్నవారు సదరు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి విరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, వట్లూరు సబ్ రిజిస్ట్రీ పెదపాడు మండలం, 10వ రోడ్డు, నెహ్రూ నగర్, దాఖలా 300 చదరపు గజముల స్థలం, దగ్గర డో.నెం. 9-11-20 కు హద్దులు:

తూర్పు: పోరంబోకు స్థలం 31 అ||లు.
దక్షిణం: మాగంటి బాబు స్థలం 89 అ||లు.
పడమర: రాజవీధి 31 అ||లు.
ఉత్తరం: పి.యోగానందం అనే పెరుమాళ్ళ యేసునాథం గారి సరిహద్దు గోడ 86 అ||లు.

పై హద్దుల మధ్య 300 చదరపు గజముల స్థలం ఉన్నది.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.8,00,000/-
అమీనా విలువ : రూ.20,00,000/-

కె.జె.వివస్వంత
ఏలూరు, **పి.నాగమురళి**
11-9-23. అడ్వకేట్స్, ఏలూరు.

బంద్ ప్రశాంతం

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో

ప్రజాశక్తి - చాట్రాయి

టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రిమాండ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ మండలంలోని టిడిపి నాయకులు సోమవారం బంద్ నిర్వహించారు. రాష్ట్ర టిడిపి ఇచ్చిన బంద్ నేపథ్యంలో చనుబండలో ఇండియన్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్, స్కూల్‌లను మండల కేంద్రమైన చాట్రాయిలో ఏలూరు పార్లమెంటు అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి ఆధ్వర్యంలో జనసేన కార్యకర్తలు టిడిపి నాయకులతో కలిసి దుకాణాలు, బ్యాంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను బంద్‌లో భాగంగా మూయించేశారు. ఈ బంద్ కార్యక్రమంలో ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, కంచర్ల హనుమంతరావు, కొండలరావు పాల్గొన్నారు.

భీమడోలు : టిడిపి పిలుపు మేరకు భీమడోలులో రాష్ట్ర బంద్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇంఛార్జి పత్సమట్ల ధర్మరాజు తమ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బంద్‌కు సంఘీభావం తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు బంద్ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రైవేటు పాఠశాలలు బంద్ నేపథ్యంలో ముందస్తుగానే సెలవును ప్రకటించాయి. జనసేన, టిడిపి కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు మూసివేసి మద్దతు తెలపాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థలు మూతపడ్డాయి. భీమడోలు జంక్షన్‌లో జనసేన, టిడిపి కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్‌కు కొద్దిగా ఇబ్బంది ఏర్పడింది. టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు గృహనిర్బంధం మూడవ రోజైన సోమవారం కొనసాగింది. ఇదేవిధంగా ఆ పార్టీకి చెందిన మండల స్థాయి నేతలను పోలీసులు గృహ నిర్బంధించారు.

జీలుగుమిల్లి : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ ప్రకటించిన నేపథ్యంలో జీలుగుమిల్లిలో టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ బంద్‌కు జనసేన మద్దతు ప్రకటించింది. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను మూయించారు. అదే విధంగా పలు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా అయా వ్యాపార దుకాణలను మూసివేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, జనసేన ఇంఛార్జి చిర్రి బాలరాజు, పి.కృష్ణ పాల్గొన్నారు.

చింతలపూడి : పట్టణంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ శాంతియుతంగా బంద్, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలు, దుకాణాలు, పెట్రోల్ బ్యాంకులు స్వచ్ఛందంగా మూసివేశారు. చింతలపూడి నియోజకవర్గ ఎంఎస్‌పి ఎంఆర్‌పిఎస్ నాయకులు బంద్‌కు సంఘీభావం తెలిపారు. కొన్ని కళాశాలలను, పాఠశాలలను, టిడిపి నాయకులు మూయించారు. టీ, హోటల్స్ తప్ప మిగతా దుకాణాలు మూసివేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి

ఆగిరిపల్లిలో బంద్ నిర్వహిస్తున్న టిడిపి, జనసేన కార్యకర్తలు

నియోజకవర్గ కన్వీనర్ అవినాష్, మండల ప్రధాన కార్యదర్శి కొండ్రుదేవా, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాగేంద్ర, మల్లాయిగూడెం సర్పంచి చికటి కవిత, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకురాలు చౌటపల్లి విజయ్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం పట్ల టిడిపి పిలుపులో భాగంగా సోమవారం మండలంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో బంద్ నిర్వహించారు. విద్యాసంస్థలను, బ్యాంక్‌లను, దుకాణ సముదాయాలను మూయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.కోటేశ్వరరావు, సిహెచ్.శివరామకృష్ణ, కె.మంగయ్య, ఎన్.వేణు, ఎం.గోపాలకృష్ణ, జనసేన నాయకులు ఎం.మహేష్, సింహాచలం, సువర్ణబాబులు పాల్గొన్నారు.

మండవల్లి : టిడిపి నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం అవివేకమని టిడిపి

చనుబండలో బ్యాంక్‌ను మూసివేయించిన టిడిపి నేతలు

నాయకులు స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలు మండవల్లిలో సోమవారం బంద్ నిర్వహించారు. స్టేషన్ రోడ్‌లో ఉన్న దుకాణాలను, సబ్ రిజిస్టర్ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్ పాఠశాలలను బందులో భాగంగా మూయించారు. అనంతరం డౌన్ డౌన్ జగన్ అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడుపై, టిడిపి నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ ర్యాలీ చేశారు. సమాచారం అందుకున్న కైకలూరు సిఐ కృష్ణ కుమార్, టౌన్ ఎస్ఐ జ్యోతిబాస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని బందిని అడ్డుకొని బందులో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు నారగాని వీర వెంకట నాగేశ్వరావు, చావత్తిన విజయ్, ముళ్లపూడి సత్తిబాబు, కోనపు రెడ్డి కోటేశ్వరరావు, మరి కొంత మందికి 41 నోటీసులు ఇచ్చి అనంతరం విడుదల చేశారు.

టి.నరసాపురం : టిడిపి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని తిరుమలదేవిపేట, బంధంచర్ల, టి.నరసాపురం, మక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో నాయకులు దుకాణాలు, పాఠశాలలు, కార్యాలయాలను మూయించి, శాంతియుతంగా బంద్ నిర్వహించారు. అదేవిధంగా చంద్రబాబు ఆరోగ్యంగా వుండాలని, వెంటనే బెయిల్ రావాలని కోరుతూ స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, నాయకులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, తోట లక్ష్మీనారాయణ, కోరుకొండ భద్రం పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌లో భాగంగా సోమవారం ఏలూరులో బంద్ పాక్షికంగా నిర్వహించారు. ఉదయం ఏలూరు బస్టాండ్‌లో ఆర్‌టిసి బస్సులు యథాతదంగా తిరిగాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా పాఠశాలలకు సెలవు ఇచ్చి బందుకు మద్దతు ప్రకటించగా, మరికొన్ని పాఠశాలలు యథాతదంగా పనిచేశాయి. అలాగే నగరంలోని వన్ టౌన్ గడియారపు స్తంభం సమీపంలోని బంగారం, ఇతర దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయగా, వన్ టౌన్‌లోని ఇతర ప్రాంతాల్లో దుకాణాలు యథాతదంగా తెరిచి ఉంచారు. అలాగే టూ టౌన్ ప్రాంతంలో చాలా వరకు దుకాణాలను టిడిపి కార్యకర్తలు మూయించారు. ఉదయం నుంచి పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలను టిడిపి కార్యకర్తలు మూయించి ఉద్యోగులను బయటకు పంపించారు. డిఇఒ కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, ఉద్యానవన శాఖ తదితర కార్యాలయాలను టిడిపి కార్యకర్తలు మూయించారు. అయితే విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

ద్వారకాతిరుమల : చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్ నేపథ్యంలో ద్వారకాతిరుమలలో బంద్ నిర్వహించారు. మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ సెంటర్ నుంచి ఎంఆర్ఒ ఆఫీసు వరకూ ర్యాలీగా వెళ్లి షాపులు, ప్రైవేటు, వ్యాపార దుకాణలను మూసి వేయించి బంద్ చేశారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసి ఇబ్బంది పెడుతున్నారని నినాదాలు చేశారు. బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలో చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ టిడిపి చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. దుకాణాలు, హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మూతబడ్డాయి. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాసరావు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ లంకా రత్నారావు, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కురేళ్ల ఏడుకొండలు, కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు(నాని), దున్నా భోగేశ్వరరావు, దుగ్గిరాల పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మండలంలోని కొరుకొల్లులో జరిగిన బంద్‌లో సర్పంచి బట్టు లీలా కనక దుర్గ, నాయకులు నున్న సుబ్రహ్మణ్యం, ఆముజాల శ్రీరామ సాయి, నరహరిశెట్టి చంద్రకళాధరరావు, తోట వీరాంజనేయులు, గంటా సోమయ్య, బట్టు మహేష్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి, జనసేన సంయుక్తంగా సోమవారం నిర్వహించిన బంద్ పాక్షికంగా విజయవంతమైంది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడ్డాయి. దుకాణాలను పలువురు స్వచ్ఛందంగా మూసివేయగా మరికొన్నింటిని రాజకీయ నాయకులు మూయించారు. అయితే ఆర్‌టిసి పలు బస్సులు మాత్రం యథావిధిగా నడపడంతో ప్రయాణికులు ప్రయాణాలు సాగించారు. టిడిపి నాయకులు పాతూరి విజయకుమార్, జనసేన నాయకులు వంగా రఘు ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొన్నారు. కాగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించారు.

జీలుగుమిల్లిలో బంద్ నిర్వహిస్తున్న టిడిపి నేతలు

బుట్టాయగూడెం : చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ టిడిపి రాష్ట్ర బంద్ నేపథ్యంలో మండలంలో శాంతియుతంగా బంద్ నిర్వహించారు. వివిధ వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, కిరాణా, వివిధ సంఘాలు పూర్తిగా బంద్‌కు సహకరించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, పంచాయతీ ఉప సర్పంచి కుందుల శ్రీను, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నల్లూరి కృష్ణమోహన్, రాష్ట్ర ఎస్‌సి సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు, నియోజవర్గ ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు, కుజం నాగేంద్ర, కైకల సూరిబాబు, బడిశా ముత్యాలరావు, చోడెం అర్జున్, కుజం ప్రసాద్, తురం శ్రీను, మడి సోమరాజు, మిర్తివాడ ప్రతాప్, వంక రాజు, వరక కృష్ణరాజు, గద్దె వీరబాబు, నక్క సుబ్బారావు, సుంకర వెంకట్రావు, మానికల శ్రీను పాల్గొన్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ఏ విధంగా అరెస్టు చేశారని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ప్రశ్నించారు. మండలంలోని టిడిపి నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడును ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా ఏ విధంగా అరెస్టు చేశారని ప్రశ్నించారు. సిబిఐ డైరెక్టర్ రూ.550 కోట్లు అవినీతి జరిగిందని మాట్లాడారు, కానీ ఇక్కడ చూస్తే రూ.241 కోట్లు మాత్రమే మీడియాలో చెప్పారు. ప్రెస్ మీట్‌లో కావాలని బురద జల్లటానికి మాత్రమే అబద్ధం చెప్పారన్నారు. సిఐడి డైరెక్టర్, ఎ1గా చంద్రబాబు నాయుడన్నారు. ఇక్కడ చూస్తే ఛార్జ్ సీట్లో 37గా ఉన్నారన్నారు. అది కూడా అబద్ధం ఆడారని పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నన్ను, మా నాయకులను మూడు రోజులుగా హౌస్ అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, బుట్టాయగూడెం మండల ఉపసర్పంచి కుందుల శ్రీను, రాష్ట్ర ఎస్‌సి సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు, నియోజవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ, తుర్రం శ్రీను పాల్గొన్నారు.

ముసునూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టునకు నిరసనగా రాష్ట్ర టిడిపి నాయకులు అచ్చెం నాయుడు ఆదేశాల మేరకు మండలంలోని ముసునూరు, కాట్రేనిపాడు, చెక్కపల్లి, రమణక్కపేట, వలసపల్లి, ఇలా పలు గ్రామాల్లో నిరసనలు తెలియజేశారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగ సంస్థలు, పాఠశాలలు, బ్యాంకులు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. కొన్ని గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు బంద్ చేయించారు. గుడిపాడు గ్రామంలో టిడిపి నాయకులు కొల్లి గంగరామ్, మండలపు ధర్మరాజు, పలువురు కార్యకర్తలతో కలిసి కాగడాలతో నిరసన వ్యక్తం చేశారు. చెక్కపల్లి నాల్గురోడ్ల కూడలిలో మాజీ ఉపసర్పంచి కాటేపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో టైర్లు కాల్చుతూ నిరసన వ్యక్తం చేయడంతో ఎస్ఐ యం.కుటుంబరావు తమ సిబ్బందితో కలిసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

ముదినేపల్లి : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మండలంలో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలోని అల్లూరులో దావు నాగరాజు, శ్రీహరిపురంలో కె.విఠల్, పరసా విశ్వేశ్వరావు, వడాలిలో

జంగారెడ్డిగూడెంలో బంద్ నిర్వహిస్తున్న టిడిపి నేతలు

వీరమల్లు నరసింహారావుల ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. పెదపాలపర్రులో టిడిపి నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముదినేపల్లిలో దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. కె.వినోద్ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన నాయకులు మండల టిడిపి కార్యాలయం ఎదుట గుడ్లవల్లేరు రహదారిపై నిరసన తెలిపారు. బంద్ సందర్భంగా ఎస్ఐ డి.వెంకటకుమార్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం : నారా చంద్రబాబు నాయుడు అరెస్టుపై టిడిపి పిలుపు మేరకు చేపట్టిన బంద్ పట్టణంలో ప్రశాంతంగా ముగిసింది. సోమవారం పట్టణ మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో సీనియర్ టిడిపి నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఆర్‌టిసి బస్సులు యథాతథంగా తిరిగాయి.

పోలవరం : పోలవరం ఏటిగట్టు సెంటర్ ఎల్ఎన్‌డి పేట, ప్రగఢపల్లి, కొత్త పట్టిసీమ, గూటాల గ్రామాలలో బంద్ చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకి 14 రోజుల రిమాండ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్ట్‌కు నిరసనగా టిడిపి పిలుపుమేరకు గూటాల మాజీ సర్పంచి పాపోలు గణపతి రత్తయ్య ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. స్కూల్స్, బ్యాంకులు, షాపులు మూయించారు. ఈ కార్యక్రమంలో పోలవరం మండల తెలుగు యువత అధ్యక్షులు పెద్దేహపు సత్యనారాయణ, జిల్లా తెలుగు రైతు అధికార ప్రతినిధి ఏనుగుల శ్రీనివాసు, పార్టీ సీనియర్ నాయకులు సంభా సత్యనారాయణ, జల్లేపల్లి పెద్దబ్బులు, తాళ్లపూడి వెంకటేశ్వరరావు, కొంజర్ల సత్యనారాయణ, శాపాని జీవన్ కుమార్, క్రొవిడి విష్ణు, పాలూరి కృష్ణ, కొవిడి ముసలయ్య, తుంపల్లి సతీష్, జక్కుల నాగేంద్ర, జీళ్ల సతీష్, తెలుగు యువత సైనికులు పాల్గొన్నారు.

కైకలూరు : జగన్‌మోహన్ రెడ్డి కక్షపూరితంగా తన కోరికను తీర్చుకునేందుకే చంద్రబాబును జైలుకు పంపించారనీ, ప్రజా సమస్యలను వదిలేసి కక్ష సాధింపులే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం నడుస్తుందని మాజీ మంత్రి, బిజెపి నాయకుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో చంద్రబాబు అరెస్టును ఖండించారు. 2020 నుంచి ఎలాగైనా కేసుల్లో ఇరికించాలని జగన్ ప్రయత్నిస్తున్నారని, ఎట్టకేలకు కేసుల్లో ఇరికించారన్నారు. ఇలాంటి దారుణమైన పరిపాలన దేశంలో ఎక్కడా లేదని, జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలను, నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. కేవలం తన కోరిక తీర్చుకోవడమే లక్ష్యంగా అన్ని వ్యవస్థలను గత నాలుగు రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం. ABC-CS/006/2015

H.O. : ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521 225. Phone: 0866-6650307
B.O. : ABCCS , D.No.23B-5-96/1, R.R.Peta, ELURU-534 002, Ph: 08812-249787

ఈ ప్రకటనలోని వారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వకంగా అభ్యంతరములను రిజిస్టరు పోస్టు విత్ ఎకనాలెడ్జ్‌మెంటు ద్వారా సొసైటీకి తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	Sri. Devambhotla Rajasekhar, GL No. 42586, S/o. D.Subrahmanya Sharma, D.No. 9-90, Indira Nagar, Hanuman Junction, Krishna Dist, A.P-521105. Cell: 9866364002 /8187834002	The Property an extent of 321 Sq. Yds of house site along with RCC roofed residential building therein, in RS No. 195/1A, Old D.No.9-56, New D.No. 16-25, Present D.No. 9-90, Asst. No. 3025, Bapulapadu (V, GP & M), Krishna Dist., A.P. - 521105 Value Rs. 31.90 Lakhs.

Branch Manager
Eluru, **NORI LAKSHMI NARASIMHAM**
11-09-2023. Cell No. 92810 29465/ 63006 34609